వినేనాధుడు

ద్విభాష్యం రాజేశ్వరరావు

తలుపు తెరిచి ఆశ్చర్యపోయాను.

ఎదురుగా ఆమె!

ప్రక్క వాటాలోని జూనియర్ ఇంజనీరుగారి భార్య!

"మీరా!" అన్నాను తొట్రుపాటుతో.

ఆమె మాట్లాడలేదు.

"లోపలకు రండి!" అన్నాను అక్కడనుండి కదలకుండానే.

ఆమె రాలేదు. ఓ నిముషం గడిచాక మెల్లగా అంది. "మీరు అడ్డంగా నిలబడితే ఎలా రాను?"

నా పొరపాటు అర్థమయింది. తడబాటు కప్పిపుచ్చుకుంటూ ప్రక్కకు తప్పుకున్నాను. ఆమె మెల్లగా నడిచి వచ్చి మంచం ప్రక్కన నిలబడి పోయింది. నేను తలుపు ఓరగావేసి ఆమె ననుసరించిలోనికి వచ్చేసి. అప్పుడు మొదటిసారిగా నొచ్చుకున్నాను, గదిలో ఒక కుర్చీ అయినా కొని వెయ్యలేక పోయినందులకు!

"అలా మంచంమీద కూర్చోండి,"

అన్నాను. అసలే చిన్న గది! ఆమె నిలబడి వుంటే ఇటూ అటూ గదిలో తిరగ టానికి ఇబ్బందిగా వుంది. మంచం కంది పోతుందేమోనన్నట్లు పట్టెమీద ఒక వారగా కూర్చుంది ఆమె.

సాయంకాలం అయిదున్నర అయింది. అయినా, మబ్బులు ఆకాశంలో వుండటం వలన గదిలో కాస్త చీకటిగా వుంది. లైటు వెలిగించివచ్చి పుస్తకాల గుట్ట ఓ మూలకు నెట్టి టేబిలుమీద కూర్చున్నాను. ఆమె ఏమీ మాట్లాడ లేదు కొంతసేపు.

గదిలో ఉక్కగా వుంది. ఆమె చీర కొంగుతో విసురుకుంటోంది. ఫాను కొనలేని నా ఆర్థిక దస్థితి మరోమాటు జ్ఞప్తికివచ్చింది. ఈమె ఎందుకు వచ్చింది? నాతో ఏం పని? నా గది కిటికీవద్ద నిలబడితే వాళ్ళ డ్రాయింగు రూము కనుపిస్తుంది. ఆమె ఆ గదిలో కదిలినపుడు ఈ నాలుగునెలలుగా చాలా పర్యాయాలు ఆమెను చూశాను. కాని ఇంతవరకూ మా మధ్య పలకరింపులు జరగలేదు. ఆ మాటకొస్తే, ఆమె భర్తతోకూడా నేను ఎన్నడూ మాట్లాడ లేదు. ఉదయం యూనివర్సిటీకి వెళ్ళి పోతే సాయంకాలం అయిదు దాటేక రూమ్‌కు రావటం – హోటలుకు వెళ్ళి భోజనంముగించి ఏ తొమ్మిదింటికో వచ్చి చదువుకొని నిద్ర కుపక్రమించటం – ఈ చర్యలవలన పొరుగువాళ్ళతో పరిచయం పెంచుకోటం కష్టమే నాకు! కనీసం ఇంతవరకూ ఆమె పేరయినా తెలుసుకోలేకపోయినందులకు కించిత్తు బాధపడ్డాను.

"నా పేరు అనూరాధ" అందామె అంతలోనే.

"అవునవును, తెలుసు" అన్నాను, ఏమనాలో తోచక.

ఆమె ఆశ్చర్యంగా నా వంక చూసింది "ఎలా తెలుసు?" అంది.

నాకు గొంతుకలో వెలక్కాయ పడి నట్లయింది. సమాధానం ఏం చెప్పను? అబద్ధంకూడా సరిగా ఆడలేకపోయాను.

"మీ వారు ఆఫీసుకు వెళ్ళేటపుడు పిలుస్తుంటే విన్నాను." ఒక అబద్ధాన్ని కప్పిపుచ్చటానికి తడుముకోకుండా మరో అబద్ధం ఆడేను. ఆ సంగతి బయటపడ కుండా ఒక వెర్రినవ్వు ముఖానికి పులుముకున్నాను.

"మీరు అబద్ధం ఆడుతున్నారు."

నేను మాట్లాడలేదు. ఆమె ఈ విధంగా దాడిచేయటం నాకంత రుచించ లేదు.

"మాకు పెళ్ళయి సంవత్సర మయింది. ఈ ఏడాదినుండీ ఆయన ఒక్కసారయినా నన్ను పేరుపెట్టి పిలుస్తారేమోనని చూస్తున్నాను! ఉహు! నాపేరు నేనే మరిచిపోయే స్థితికి వచ్చేను. 'ఒసేవ్' 'ఏమేవ్' ఇత్యాదులు నా పేర్లు..." కొంతసేపు ఆగి "పోనీలెండి,

మీరయినా నా పేరు తెలుసుకున్నారు. ఇకమీదట 'అనూరాధా' అని నన్ను పిలవండి! అలా పిలిస్తే నాకెంతో ఇష్టం." ఆ మాటలు అంటుంటే ఆమె కళ్ళు తడి అయ్యాయి. ఏమనాలో తోచక తలవూపేను అంగీకార సూచకంగా.

"నాకు చదువుకునేందుకు మంచి పుస్తకాలు ఏవైనా ఇవ్వండి."

"నా దగ్గర నవలలు, కథల పుస్తకాలు లేవు. నేను ప్రస్తుతం ఎమ్మే ముగించి రీసెర్చి చేస్తున్నాను. ఈ పని పూర్తయే వరకూ నవలల్ని దూరంగా వుంచుతున్నాను."

"మీరు కథలు వ్రాస్తారట!" అంది నా వంక చూస్తూ.

"ఆ! ఏదో! తోచక! అదీ మానేశాను ఇప్పుడు! రీసెర్చి ముగించే వరకూ మరో పని పెట్టుకోదల్చుకో లేదు."

"మీ సబ్జెక్టేమిటి ?"

"శ్రీనాధుడు."

"మెటీరియల్ అంతా సేకరించారా?" అంది.

"దాదాపు సేకరించినట్లే!" అన్నాను.

"శివరాత్రి మహత్యం వుందా ?"

శ్రీనాధుడు వ్రాసిన ఆ పుస్తకం గురించి అడిగేసరికి ఆమెకు తెలుగు సాహిత్యంతో కాస్త పరిచయం వున్నట్లే కనిపించింది.

నైషధంలాంటి మంచి పుస్తకాలు వుండగా అదెందుకు ?" అన్నాను పుస్తకాల గుట్టలో ఆ పుస్తకంకోసం వెదుకుతూ.

"నైషధం నా దగ్గర వుంది. హంస దూత్యంలోని పద్యాలు వారానికి ఒకసారయినా చదివి ఆనందిస్తాను. శ్రీనాధుడులాటి కవి మన తెలుగు భాషకు లభించడం మన అదృష్టం! అతడు వ్రాసిన ఇతర కావ్యాలు చాలా చదివాను. శివరాత్రి మహత్యం నాకు దొరకలేదు," అంది.

ఇంతవరకూ ఆమెను తక్కువగా అంచనా కట్టేను. శివరాత్రి మహత్యం తీసి ఇస్తూ "ఇది ఆంధ్రసాహిత్య పరిషత్తు, కాకినాడవారు ఎప్పుడో వేసిన కాపీ! బాగా నలిగిపోయింది! పేజీలు పొడిలా రాలిపోతున్నాయి ! జాగ్రత్తగా వుంచండి...పుస్తకం పరహస్తం గతం గతః అన్నారు మనవాళ్ళు !" నవ్వుతూ అన్నాను.

"పరహస్తం అన్నారు కానీ నారీ హస్తం అనలేదుగా! అయినా నన్ను పరాయిదాన్నిగా చూస్తే మీరు నాకు ఇవ్వొద్దు!" అంది.

"ఊరకే జోక్ చేశాను, అంతే !"

"మీ పుస్తకం జాగ్రత్తగా వుంచుతానులెండి." అంటూ దాన్ని తీసుకుని 'థేంక్స్' చెప్పి వెళ్ళిపోయింది.

మూడు దినాల తర్వాత ఓ ఉదయం

నేను యూనివర్సిటీకి బయలుదేరుతూ వుంటే ఆమె పుస్తకం తీసుకువచ్చింది.

"పూర్తిగా చదివేరా ?" అన్నాను.

"ఇందులో పూర్తిగా లేదుగా "

ఆమె పుస్తకం చదివింది. సందేహం లేదు! నాలుగో ఆశ్వాసంలో 'అంతట యముండేమిచేసె !' అని అరగటంతో ఆ పుస్తకం పూర్తయిపోయింది. అది చాలా సంవత్సరాల క్రితం వేసిన కాపీ. శివరాత్రి మహత్యం తాళపత్ర గ్రంథం ఆనాటికి అంతవరకూ వున్నది లభించిందట! ఆ తరువాత తెలంగాణాలో ఎవరింటనో పూర్తి గ్రంథం దొరకటం, దాన్ని ఎవరో మళ్ళీ సంస్కరించి పూర్తిగా ప్రచురించటం జరిగింది. పూర్తి కాపీ నావద్ద లేదు.

అదే విషయం ఆమెతో అన్నాను.

"శ్రీనాథుని శైలిలో కనబడే అందాలు ఈ పుస్తకంలో లేవు నాయకుడు 'సుకుమారుడు' స్వంత కూతుళ్ళతోనే రమించడం జుగుప్సగాలేదూ!" అంది.

సూటిగాచెప్పిన ఆమె అభిప్రాయానికి ఆశ్చర్యపోయాను. ఆమె యెడల నా అభిమానం పెరిగింది. వద్దంటున్నా వినకుండా స్టౌమీద నీళ్ళుపడేసి ఆమెకు కాఫీ కలిపిఇచ్చేను.

"ఆయన లేరా ?" అన్నాను కప్పు అందిస్తూ.

శ్రీకాకుళం కేంప్ వెళ్ళారు. రెండు రోజులు వుంటే మళ్ళీ వారం దినాలు కేంపులు. ఇంటిమీద మనసు మళ్ళి నప్పుడు వస్తారు."

"మరి, ఉద్యోగ బాధ్యతలు తప్పవు కదా!"

నే నా మాట అనగానే ఆమె ముఖం ఎర్రబడింది.

నామీద కస్సున లేచింది. "ఏమి టండీ బాధ్యతలు! దేశంలో ఏ జూనియర్ ఇంజనీరుకూ లేని బాధ్యతలు ఈయనకే వున్నాయికాబోలు. పెళ్ళాలను నిరాదరణగా చూస్తూ ఉద్యోగాలు చెయ్యమని ఏ ప్రభుత్వమూ శాసించటం లేదు. అయినా, ఇంటిపట్టున వుండే రెండు రోజుల్లో సరిగ్గా వుంటే లేనిరోజుల కోసం ఏడవొచ్చును. ఎప్పుడూ గొడవలే " అంటూ మాట్లాడటం ఆపింది.

"కాఫీ చల్లారిపోతోంది, త్రాగెయ్యండి" అన్నాను.

"మరి—మీకో ?"

"నే నిప్పుడు భోజనం చేస్తాను."

"నేనూ చేస్తానుగా - మరో కప్పు ఇవ్వండి, ఒన్ బై టూ తాగుదాం," అంటూ చొరవగా నా వంక చూసింది.

'మరో కప్పు అందించేను' కాఫీ ముగించేం!

భర్త విషయం ఆమె చెప్తుంటే వినడానికి ఇబ్బందిగా వుంది.

అంతలోనే అంది. "ఏమండీ ఆడదీ ఓ మనిషేనంటారా ?"

ఈ ప్రశ్నతో తడబాటు పడ్డాను.

"ఎందుకు కాదు? మనిషిలోని పరిపూర్ణతకు ఆడదే పరాకాష్ట! సంపూర్ణత్వం ఆడదానిలోనే వుంది," అన్నాను.

"స్త్రీకికూడా ఓ మనసూ, కోరికలూ, ఇష్టాఇష్టాలు వుంటాయని ఒప్పుకుంటారా?"

"ఆహా! నిరాక్షేపణీయంగా ఇంతకూ ఇవన్నీ వుండకూడదని ఎవరన్నారు?"

ఈ ప్రశ్న వేశాక నాలిక్కరుచుకున్నాను.

"మా ఆయనే'-నా భర్త, రామనాథ్‌గారు! పబ్లిక్ వర్క్సు డిపార్టుమెంటులో జూనియర్ ఇంజనీరుగా పనిచేస్తున్న భర్త! నా గోడు కాస్తంత అయినా, పట్టించుకోని మనిషి!"

ఆమె మాట్లాడే తీరుచూస్తే పసిపిల్ల గుర్తుకు వచ్చింది. వ్యవహారం మరీ సిల్లీగా వుంది.

నాకు అయిష్టంగా వున్నా, విషయం మార్చే వీలులేకపోయింది.

ఆమె భర్త గురించి తేలికగా చెప్తూంటే ఆమెమీద నాకు ఏదో అధికారం ఏర్పడిన ఫీలింగ్ కల్గింది.

"అది చాలా అన్యాయం! ఆడదానికి

విలువ ఇవ్వలేకనే ఈ దేశం ఇలా తయారయింది. ఇదే పాశ్చాత్య దేశాల్లో చూడండి! ఇద్దరికీ సమాన హక్కులుంటాయి ఆడవాళ్ళకు సమానహక్కులివ్వటం పురోగమనానికి చిహ్నం," అన్నాను ఆవేశంగా.

విశ్రాంతితో కళ్ళు విప్పార్చుకుని వింది అనూరాధ! ఆమె ముఖం నిండా ఆనందం!

"మీరు నాకు స్నేహితులుగా దొరకటం నా అదృష్టం," అంది మెల్లగా.

"మీకు యూనివర్సిటీకి వేళవుతోంది. వెళ్ళిరండి" అంటూ లేచింది.

"ఎప్పుడయినా వస్తూవుండండి," అన్నాను. ఆమె నా టేబిలుమీది కాగితాల వంక చూసి, "మీ దస్తూరి ఎంత బాగుందో! దస్తూరి అందంగావుంటే వాళ్ళ మనసులుకూడా అంత అందంగా వుంటాయిట," అంటూ పేజీలు తిరగేసింది.

"అవి నా రీసెర్చి వర్కు! శ్రీనాథుడు విలక్షణంగా వాడే 'హేవాళ' 'హేవాక' వంటి పదాలను తీసి వాటిని పరిశీలిస్తున్నాను."

"ఈ కాగితాలు నా కివ్వండి. చూసి ఇస్తాను," అంది.

ఇవ్వనని ఎలా చెప్పగలను ?

"అది నా ప్రాణం," అన్నాను. "నాకూ అంతే, మంచి మిత్రులంటే ప్రాణం" అంటూ వెళ్ళిపోయింది, ఆ కాగితాలు తీసుకుని.

మరునాడు ఉదయం నిద్రలేచేసరికి ఆ కాగితాలు నా గదిలో వున్నాయి. న్యూస్‌పేపరు కట్టి భద్రంగా కిటికీలోంచి పడేసినట్లుంది అనూరాధ. ఆత్రంగా కాగితాలు విప్పిచూసేను. పేజీ పేజీకి మధ్య ఏదైనా కాగితం దొరుకుతుందేమోనని!

కాగితం అంటే మామూలు కాగితం కాదు-ప్రేమలేఖలాంటిది!

ఈ ఉదయం మొదటిసారిగా ఈ ఆలోచన నా మనసులోకి వచ్చింది.

నా మనసు అనూరాధను అభిమానిస్తోంది-కాదు కోరుతోంది!

నిరాశగా కాగితాలు టేబిలుమీద పడేశాను.

అద్దంలో నా ముఖం చూసుకున్నాను. నేను రామనాథ్‌కంటె అందంగానే వుంటాను. సందేహంలేదు! అంతేకాదు అనూరాధ అందానికీ, అందమయిన మనసుకీ ఆ మోటుమనిషి తగడనిపించింది.

ఆ సాయంకాలం యూనివర్సిటీ నుండి వస్తుంటే, వీధి మలుపులో అనూరాధా, ఆమె భర్తా కనిపించేరు. లేతనీలంరంగు నైలెక్స్ చీరలో అనూరాధ అప్సరసలా మెరిసిపోతోంది. బంగారు లాకెట్ ఆమె నిండయిన



రొమ్ముల మధ్య ఒదిగి వయ్యారాలు పోతోంది.

వాళ్ళవంక చూసి చిరునవ్వుతో 'గుడ్ ఈవినింగ్' అన్నాను. రామనాథ్ తిరిగి విష్‌చేశాడు అతని ముఖంలో ఏ భావమూ లేదు. ఇద్దరినీ దాటి గదికి వచ్చేశాను.

రెండు దినాల తరువాత అనూరాధ వచ్చింది. "ఉదయం ఆయన కేంపు వెళ్ళిపోయారు. తుఫాను వెలిసినట్లయింది" అంది మంచంమీద దుప్పటి సవరించి కూర్చుంటూ.

"ఏం?" అన్నాను.

"ఆవేళ రాత్రి ఒకటే గొడవ! సాయంకాలం చిరునవ్వుతో విష్ చేశారు కదా మీరు! అందులో విష్ ఆయనకీ, చిరునవ్వు నాకూనట! ఛీ! ఒట్టి అనుమానం మనిషి!"

రామనాథ్ ఘటికుడే! గొప్పగా 'ఎనలైజ్' చేశాడనుకున్నాను మనసులో.

"...ఆ ముందురోజు రాత్రి మీ రిసెప్ట్ కాగితాలు నా దగ్గర వుండటం చూసి నన్ను కొట్టేరు." ఆ మాటలు అంటూవుంటే ఆమె కన్నుల్లో నీళ్ళు తిరిగాయి.

నేను చలించిపోయాను.

రామనాథ్ మనిషా! పశువా? ఛీ! అనూరాధని కొట్టడానికి అతనికి చేతు లెలా వచ్చేయి? అంత అందమైన,

మృదువయిన శరీరంమీద చెయ్యేసుకో టానికి అతనికి మనసెలా ఒప్పింది?

నా మనసు వశం తప్పుతోంది!

తలుపు దగ్గరగావేసి ఆమె వద్దకు వచ్చేను.

"అనూరాధా!" గోముగా పిల్చేను. ఆమె తలెత్తి నావంక చూసింది. "మీ పరిస్థితికి నాకు చాలా జాలికలుగుతోంది. మీలాటి అప్సర భార్యగా దొరకటమే ఒక వరం. మిమ్మల్ని కొట్టడానికి అతని మనసెలా ఒప్పిందో నాకు అర్థం కావటంలేదు." నా ఓదార్పు మాటలకు ఆమె కళ్ళు ఆనందంతో మెరిసేయి.

నేనంటే ఎంత ఇష్టమో ఆ ముఖమే చెప్తోంది.

నామీద ఎంత ప్రేముందో మెరిసే ఆ చెక్కిళ్ళే చెప్తున్నాయి.

"అనూరాధా" గొణుగుతూ ఇంకా దగ్గిరగా వెళ్ళాను.

వణికిపోతున్న చేతులతో ఆమె ముఖాన్ని అదిమిపట్టి దగ్గరగా తీసుకొని......

అంతే! కళ్ళు మసకబారేయి!

నా ఎడమచెంప పగిలినంత పనయింది!

జరిగింది అర్థంచేసుని కళ్ళువిప్పి చూసేసరికి ఆమె నా ఎదుట రొప్పుతూ నిలబడివుంది.

"చిన్నతనంనుండీ నాన్నా, అమ్మా, అక్కలూ, అన్నలూ ఎవ్వరూ తోడు లేకుండా పెరిగేను. నా కష్టం, సుఖం చెప్పుకునేందుకు కూడా ఎవరూ లేరు నాకు! ఇంత కాలానికి మంచి స్నేహితుడు దొరికేడనుకున్నాను. నా బాధలు విని రవంత సానుభూతి చూపిస్తారని ఆశించేను. ఛీ! మొగాళ్ళంతా ఇంతే! కుక్కలు"

ఆమె కళ్ళు నీళ్ళు వర్షిస్తున్నాయి! కాదు - నిప్పులు కురిపిస్తున్నాయి! గబగబా గదిలోంచి వెళ్ళిపోయింది.

"ఆమె చదువుకొని ఆనందించేందుకు శ్రీనాధుడున్నాడు! ఆమె అవసరాలను చూసి బ్రోచే నాధుడు-భర్త రామనాధు డున్నాడు! ఆమె గోడు చెప్పుకునేందుకు వినే నాధుడు ఆమెకి కావాలి! ఆ నాధుణ్ణి నేను! కేవలం-వినే నాధుణ్ణి! అంతే!" అనుకుంటూ నీరసంగా మంచంమీద కూలబడ్డాను.